

ఖమ్మంఅర్బన్: ప్రకాశ్‌నగర్ చెక్ డ్యాం వద్ద నీటిలో తేలియాడుతున్న వినాయక విగ్రహాలు

# ‘ఉపాధి’ వేటలో..

తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుడికి సోమవారం వీడ్కోలు పలికారు. అయితే మున్నేరులో నిమజ్జనం చేసిన కొన్ని వినాయక విగ్రహాలు పూర్తిగా మునగక నీటిపైనే తేలియాడుతూ కనిపించాయి. మరోవైపు విగ్రహాలు తయారు చేసేందుకు ఉపయోగించిన ఐరన్, కర్రలు కూడా విగ్రహాల నుంచి విడిపోయి ఒడ్డుకు చేరాయి. దీంతో కొందరు స్థానికులు మున్నేరులో దిగి వాటిని ఒడ్డుకు చేర్చి తీసుకెళ్లారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కాల్వొడ్డు మున్నేరు వద్ద ఒడ్డుకు చేరిన విగ్రహాలు



ఖమ్మంరూరల్ పెద్దతండా వద్ద మున్నేరులో పూర్తిగా మునగని విగ్రహాలు



విగ్రహాల నుంచి కర్రలు, ఇతర సామగ్రిని తీస్తున్న స్థానికులు



మున్నేరులో విగ్రహాల నుంచి ఇనుము స్వీకరిస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ పరిధిలో శంకుస్థాపన జరిగిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో మంగళవారం తనను కలిసిన కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ తదితరులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

### దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంరూరల్: విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏదులాపురం సబ్‌స్టేషన్ ఏఈ క్రాంతిసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఇంటికి రూ.938లకే మీటర్ ఇవ్వాలని ఈనెల19 నుంచి 28 వరకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 19న తెల్దారుపల్లి, 20న గుదిమళ్ల, 21న మద్దులపల్లి, 22న ఏదులాపురం, 23న వెంకటగిరి, 24న కోటనారాయణపురం, 25న సత్యనారాయణపురం, చినతండా, 26న పెదతండా, జలగంనగర్, 27న పెదతండా, నాయుడుపేట, 28న గుర్రాలపాడులలో అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### 20న దుకాణాలకు వేలం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ట్రంక్‌రోడ్‌లో ఉన్న శ్రీ గుంటుమల్లేశ్వర స్వామి దేవాలయం పరిధిలో ఉన్న 4 దుకాణాలకు ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి చండూరు రామకోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబర్ 1, 5 షాప్‌లకు రూ. 50 వేల చొప్పున, నంబర్ 3, 4 షాపులకు రూ. 20 వేల చొప్పున డీడీల రూపంలోతీసి టెండర్ దరఖాస్తుతో పాటు ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లో వేయాలని తెలిపారు.

### ఖోఖో పోల్స్ వితరణ

ఖమ్మంఅర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు మంగళవారం బీజేపీ ఖమ్మంఅర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమలి శ్రీనివాసరావు ఉచితంగా ఖోఖో పోల్స్ అందించారు. పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నరేందర్, బీజేపీ నాయకులు కంపసటి అంజన్న, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

**టై, బెల్ట్,బ్యాడ్జీలు..**

రఘునాథపాలెం: మండలంలోని యూపీఎస్ గణేశ్వరం పాఠశాలలో ప్రశాంతి ఆస్పత్రి ఆధ్వర్యాన మంగళవారం రూ.11 వేలు విలువ చేసే టై, బెల్ట్, బ్యాడ్జీలను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కే.విజయ్‌శ్రీ, దాతలు మధు, శివ, రాజేష్, నరేష్, ప్రదీప్, ఉపాధ్యాయుడు గోపాలరావు, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది రాధా, ప్రియాంక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### సాగు నీరు అందించాలి

నేలకొండపల్లి: తక్షణమే సాగు నీరు అందించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకుడు పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ మాణిక్‌రావు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. 20 రోజుల నుంచి సాగు నీరు అందక వరి పంటలు ఎండుతున్నాయన్నారు. అలాగే వరదల వలన నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చిర్రా భిక్షం, తోగటి నాగయ్య, అరుణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటికీ ఓటర్ల సర్వే..

తిరుమలాయపాలెం: మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) ఇంటింటికీ ఎలక్షన్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ఎలక్షన్ కిట్లను పంపిణీ చేశారు. సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా హౌస్ టు హౌస్ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వీరయ్య, డీటీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు అజరామరం

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం అమరవీరుల పోరాటాలు, త్యాగాలు అజరామరం అని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్, వామపక్షాలు, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ఆధ్వర్యాన విమోచనం, విలీనం, విద్రోహ వేడుకల పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాలు, పంచాయతీ, సొసైటీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో జెండా ఎగురవేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



ఖమ్మంమయూరిసెంటర్: మాస్‌లైన్ జెండాను ఆవిష్కరించిన నాయకులు



ఖమ్మంవన్‌టౌన్: మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న మేయర్ నీరజ



ఖమ్మంరూరల్: తహసీల్‌లో వందనం చేస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్, ఇతర అధికారులు



ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం టౌన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో..



ఖమ్మం సహకారనగర్: టీజీవోస్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న దృశ్యం



తిరుమలాయపాలెం: సుబ్లేడులో అమరుడు షోయాబుల్లాఖాన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఖమ్మం స్పోర్ట్స్: సర్దార్ పటేల్ స్టేడియంలో జెండా ఆవిష్కరిస్తున్న డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి



నేలకొండపల్లి: మోటాపురంలో జెండా వందనం చేస్తున్న స్థానికులు



ఖమ్మం సహకారనగర్: శ్రీరామకృష్ణ విద్యాలయంలో జెండా వందనం చేస్తున్న దృశ్యం



కామేపల్లి: తహసీల్‌లో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ సుధాకర్



ఖమ్మంగాంధీచౌక్: జిల్లా గ్రంథాలయంలో..

# మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

రఘునాథపాలెం/కామేపల్లి: మొక్కలు నాటడం, నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రవీందర్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలం వీవీపాలెంలో ప్రభుత్వ పాఠశాలలో డీఎల్‌పీఓ మొక్కలు నాటగా.. కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంపీడీఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు సంరక్షణతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈమేరకు రఘునాథపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించగా.. సొసైటీ వైస్ చైర్మన్ రావేళ్ల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కామేపల్లి కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, ఈజీఎస్ సిబ్బంది భాస్కర్, అజ్మీరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం: మొక్క నాటుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

### జమిందారీ ఆగడాలపై సాగించిన సమరం

రఘునాథపాలెం: భూస్వామ్య, రాచరిక బానిసత్వంపై తిరగబడి, భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిందే వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరావు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని చింతగుర్తిలో తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని ఏర్పాటు చేసిన నివాళి సభలో ఆయన మాట్లాడారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా సాగించిన సమరమే సాయుధ పోరాటమని, నిజాం రజాకారు మూకల జమీందారీ ఆగడాలపై సాగించిన సమరమే తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. పార్టీ గ్రామ నాయకుడు లింగనబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి, డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్‌పై కర్రతో దాడి..

- ఆరుగురిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం అగ్రహారం న్యూ కాలనీకి చెందిన షేక్ నాగుల్‌మీరా అనే ఆటో డ్రైవర్‌పై అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దాడి చేయడంతో తలకు బలమైన గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఆటో యూనియన్ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు. రెండో వర్గంలో సభ్యుడైన మాది అల్లహజారే వర్గం గతకొద్ది రోజులుగా ‘నువ్వు కూడా మా వైపు రాకుంటే నీ సంగతి చూస్తాం’అని నాగుల్ మీరాను కర్లపూడి వెంకన్న, బరిగల వీరబాబు, కట్ల ప్రసాదు, రాకేష్, రావుల సతీష్, అక్కి సంతోష్‌లు బెదిరించారు. ఈక్రమంలో సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనం సమయాన నాగుల్‌మీరా ఇంటి దగ్గర ఉండగా ఒక్కసారిగాపై ఆరుగురు దాడి చేసి కర్రలతో కొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితులు ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

### రెండు మట్టి టిప్పర్లు పట్టివేత

రఘునాథపాలెం: రఘునాథపాలెంకు చెందిన రెండు టిప్పర్లు పువ్వాడనగర్ సమీపంలోని గుట్టమట్టిని అక్రమంగా తవ్వకాలు చేసి తరలిస్తుండగా సోమవారం రాత్రి రఘునాథపాలెం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన టిప్పర్లను స్టేషన్‌కు తరలించి యజమానులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రైతుకు పాముకాటు

నేలకొండపల్లి: పొలంలో పనిచేస్తున్న ఓ రైతును పాము కాటేయడంతో చికిత్స పొందుతున్నాడు. మండలంలోని చెన్నారానికి చెందిన ఎం.వినోద్ మంగళవారం పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా కాలిపై పాము కాటేసింది. ఈ విషయాన్ని సహచర రైతులకు చెప్పడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### సుబ్లేడులో ఇరు వర్గాల ఘర్షణ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడులో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎస్సీలోని రెండు కులాల మధ్య ఏర్పడ్డ వివాదం ఘర్షణకు దారితీసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. దీంతో ఇరు కులాలకు చెందిన వారి ఫిర్యాదుల మేరకు పలువురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంపీ ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6 లక్షల చెక్కులను అందించినట్లు ఆయన తెలిపారు.

### ‘మోకుదెబ్బ’ నేతలకు సన్మానం

ఖమ్మంమయూరిసెంటర్: గౌడ జన హక్కుల పోరాట సమితి ‘మోకు దెబ్బ’రాష్ట్ర కార్యదర్శిగా తోలుపునూరి దానయ్య గౌడ్, ఖమ్మం టౌన్ అధ్యక్షుడిగా కందాల వీరేంద్రగౌడ్ నూతనంగా ఎన్నికయ్యారు. అయితే వీరిని మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యాన శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్, ప్రచార కార్యదర్శి షకీన, ఎచ్చు ప్రసాద్, నన్నే, ఉస్మాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యదర్శికి..**

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నాగ స్వరూప్‌రెడ్డిని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఏలూరి రంగారావు, జి.మధు, బి.వెంకటేశ్వర్లు, రామారావు, వీరయ్య, మురళీ, ప్రభాకర్‌రావు, హనుమంతరావు, ఏలూరి సురేష్ పాల్గొన్నారు.

### ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు ఎంబీ గార్డెన్స్ వద్ద ఉన్న శివాలయంలో విశ్వకర్మ పరమేశ్వర యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, మహాశ్రీ చక్ర పీఠం ఆరోతరం పీఠాధిపతి సత్తెనపల్లి ఉమామహేశ్వర చార్యులు విశ్వకర్మల పతాకాన్ని ఆవిష్కరించి, మహోత్సవ ప్రత్యేకతను వివరించారు. అంతేకాక గాంధీచౌక్, ముస్తాఫనగర్, రాపర్తినగర్, ఖానా పురం ప్రాంతాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి.



విశ్వకర్మల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# కొనసాగుతున్న వరద సాయం

- ఖమ్మంవన్‌టౌన్: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇచ్చిన ‘నా ఖమ్మం కోసం నేను’ కార్యక్రమంలో భాగంగా సెయింట్ జోసఫ్ పాఠశాల పదో తరగతి (1994 బ్యాచ్) పూర్వ విద్యార్థులు వంగూరి కిశోర్ ఆధ్వర్యాన వారి మిత్రులు నిత్యావసరాలు, 35 క్వింటాళ్ల బియ్యాన్ని వరద బాధితుల సహాయార్థం జెడ్పీ సీఈఓ దీక్షా రైన చేతుల మీదుగా పంపిణీ చేశారు.
- ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం శివారు వాల్యాతండాలో వరద ఉధృతికి గురై సర్వం కోల్పోయిన హోటల్ యజమానికి పుసుపులేటి శ్రీనివాసరావు కుటుంబానికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రూ.30వేలు విలువ గల హోటల్‌కు అవసరమైన వస్తు సామగ్రి అందించారు.
- తిరుమలాయపాలెం: ఆకేరు వరద ముంపునకు గురైనా రాకాసితండా గ్రామస్తులకు సూర్యాపేట చార్లెట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. అలాగే దమ్మాయిగూడేనికి చెందిన కీర్తిశేషులు కొప్పుల దేవయ్య మనువడు గాజుల సంజయ్ దేవ్ పుట్టిన రోజు సందర్భంగా 80 కుటుంబాలకు చీరలు, దుప్పట్లు, లుంగీలు అందించారు.



ఖమ్మంవన్‌టౌన్: నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షా రైన

# తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

ఖమ్మంమయూరిసెంటర్: సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణను వ్యతిరేకరిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నగరంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ.. సచివాలయం వేదికగా తెలంగాణ తల్లిని అవహేళన రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు మోతరపు శ్రావణి సుధాకర్, కూరాకుల వలరాజు, దండా జ్యోతి రెడ్డి, మాటేటి అరుణ నాగేశ్వరరావు, తోట ఉమారాణి వీరభద్రం, మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

### కేఎంసీలో పూర్తిస్థాయి కార్యకలాపాలు షురూ

- వరద సహాయక చర్యలతో ఇన్నాళ్లు సాధారణ పాలనకు విరామం

ఖమ్మంమయూరిసెంటర్: దాదాపు 16 రోజుల తర్వాత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సాధారణ పాలన ప్రారంభమైంది. గత 31, ఈనెల 1న ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 14 డివిజన్లు, ఖమ్మంరూరల్ మండలంలోని 20 గ్రామాలను వరద ముంచెత్తగా.. అక్కడ సహాయక చర్యలతో పాటు సర్వేలు, ఇతర పనుల్లో అధికారులు బిజీబిజీగా గడిపారు. ఆ పనులన్నీ కొలిక్కి రావడంతో మంగళవారం సాధారణ కార్యకలాపాలు కొనసాగాయి. ఒక పక్క వరదల్లో పాడైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు, మరోపక్క ప్రజాపాలనకు సంబంధించి ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ తదితర వాటిని సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు.

### జిమ్‌లో రక్తదాన శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని క్లాసిక్ జిమ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. మంగళవారం జిమ్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జిమ్‌కు వచ్చే 60 మందికి పైగా శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయగా.. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది సేకరించారు. ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు సీహెచ్. మనోజ్‌కుమార్, కోటి నగినాలు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: పీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు, యువకులు